## తాగొస్తున్నాడని భర్తకు వాతలు

వినాయక నగర్, జూన్ 27: ప్రతి రోజూ మద్యం తాగి వస్తున్నాడని నిద్రలో ఉన్న భర్తకు వాతలు పెట్టిందో భార్య. నిజామాబాద్ శివారులోని సారంగపూర్‌కు చెందిన మహేశ్,సుమలత దంపతులు వీరికి ఇద్దరు పిల్లలు. ప్లంబర్‌గా పని చేసే మహేశ్ నాలుగు రోజుల క్రితం పనికి వెళ్లి వచ్చి రాత్రి నిద్రకుపక్రమించాడు. ఆ సమయంలో సుమలత అతడి కాళ్లు, చేతులు కట్టేసి, ఇనుపరాడ్డు కాల్చి కాళ్లు, చేతులు, ముఖంపై వాతలు పెట్టింది. మహేశ్ గట్టిగా అరవడంతో పిల్లలను తీసుకుని పారిపోయింది. తర్వాతి రోజు బాధితుడు ఆరో టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## భర్తను హత్య చేసిన భార్య

చౌటకూర్, జూన్ 27: మద్యం మత్తులో ఓ కసాయి తండ్రి కన్న కూతురుపై లైంగికదాడికి యత్నించగా.. కట్టుకున్న భార్య భర్తను హత్య చేసింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో జరిగింది. సుల్తాన్‌పూర్‌కు చెందిన మన్నె మాణయ్య (50) బుధవారం రాత్రి కూతురుతో అసభ్యంగా ప్రవర్తించేందుకు యత్నించగా.. భార్య ఇందిర అతడిని గొడ్డలితో నరికి చంపింది. మాణయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు ప్రవీణ్ నిరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్సై శ్రీకాంత్ విచారణ చేపట్టారు.

## బాలికపై కానిస్టేబుల్ లైంగికదాడి

బండ్లగూడ,జూన్ 27: బాలికపై పోలీస్ కానిస్టేబుల్ లైంగికదాడి చేసిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం బుద్వేల్‌లో ఉండే గాజుల ప్రదీప్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. చర్చికి వచ్చే ఓ బాలికను నమ్మించి నాలుగేండ్లుగా పలుమార్లు లైంగికదాడి చేశాడు. సదరు బాలిక తనను వివాహం చేసుకోవాలని నిలదీయడంతో ఏడాది క్రితం పెండ్లి అయినట్టు చెప్పాడు. బాలిక తల్లితో కలిసి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఒకే ట్రిప్‌లో 130 మంది ప్రయాణం



ఆర్టీసీ బస్సులో కిక్కిరిసి ప్రయాణిస్తున్న కరీంనగర్ జిల్లాలోని గంగాధర మాడల్ స్కూల్ విద్యార్థులు

గంగాధర, జూన్ 27: కాంగ్రెస్ సర్కారు అస్తవ్యస్త విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతన్నారు. మహాలక్ష్మి స్కీం తెచ్చి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం.. ట్రిప్పులు తగ్గించి విద్యార్థులను ఇక్కట్ల పాలు చేస్తున్నది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం న్యాలకొండపల్లి శివారులోని మాడల్ స్కూల్‌లో సుమారు 750 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి దాకా రెండు ట్రిప్పులు నడిచిన బస్సును.. ఇప్పుడు ఒక ట్రిప్పు తగ్గించడంతో ఒకే ట్రిప్పులో సుమారు 130 మంది దాకా స్కూల్‌కు వెళ్తున్నారు. బస్సు కిక్కిరిసిపోవడంతో ఊపిరి కూడా ఆడటం లేదని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటికెళ్లి హోంవర్క్ కూడా పూర్తిచేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు, ట్రిప్పుల సంఖ్యను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ట్రిపుల్ ఐటీ కార్మికుల ధర్నా



*కనీస వేతనాలతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ట్రిపుల్ ఐటీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ.. జీవో నంబర్ 60 ప్రకారం హౌస్ కీపింగ్ వర్కర్స్‌కు కనీస వేతనంగా రూ.16,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పెషల్ ఆఫీసర్ సృజనకు అందజేశారు. - బాసర*

## విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రకాశ్ (ఫైల్)

కేసముద్రం, జూన్ 27 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్ల పూసపల్లి లో గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు వాలేరు ప్రకాశ్ (40) ఎకరం పొలంలో వరి సాగు చేసేందుకు ఇటీవల నారు పోశాడు. నీరు పెట్టేందుకు భార్య సరోజనతో కలిసి వెళ్లాడు. మోటర్ ఆన్ చేయగా నీరు పోయకపోవడంతో రిపేర్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. భార్య వచ్చి చూడగా అప్పటికే మృతి చెందా డు. మృతుడి భార్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 27 ( నమస్తే తెలంగాణ ): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 7న 'కొండా లక్ష్మణ్ బాపూజీ' రాష్ట్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్టు హైదరాబాద్ చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారులు జూలై 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www. tsht. telangana. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## మెరుగైన విద్యుత్తును అందించాలి: రోనాల్డ్‌రోస్

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మెరుగైన విద్యుత్తునందించాలని టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. గురువారం విద్యుత్తు సౌధలో విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, లైన్ల ను కాలానుగుణంగా పూర్తిచేయాలని ప్రా జెక్ట్స్ డైరెక్టర్, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్లను ఆదేశించారు. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయడంపట్ల సంతృప్తిని వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయి ఇంజినీర్లు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే చక్కదిద్దాలని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెహ్రూ, భాస్కర్ సీఎండీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.







Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.